సాక్షి సంగారెడ్డి

బుధవారం, 1, మార్చి, 2023



గుండెపోటుతో కండక్టర్ మృతి
గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ డిపోలో పని చేస్తున్న ఓ కండక్టర్ గుండె పోటుతో మరణించాడు. డ్యూటీలో చార్జ్ మెమో ఇవ్వడమే కారణమని కుటుంబీకులు చెబుతున్నారు. 8లో



పెళ్లి కావడం లేదని..
పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో



పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి
జిల్లా వ్యాప్తంగా వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి పన్నులు వసూలు చేస్తున్నారు. 9లో

సమస్య మీది.. పరిష్కారం మాది

నేడు తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు, కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి నివారణ చర్యలతో పాటు మున్సిపాలిటీ తీసుకుంటున్న చర్యలపై కాల్ చేయవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో మాట్లాడి పరిష్కరించుకోవచ్చు. పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సందేహాలను తీర్చుకోవచ్చు.





తేదీ: 01-03-2023
సమయం: ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్: 08455 - 295400

న్యూస్‌రీల్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలో జిల్లా మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు శనగలకు మద్దతు ధర రూ.5,335 ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంతమ్మ, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు జగన్నాథం, రైతు బంధు అధ్యక్షుడు ప్రభు పటేల్, సొసైటీ డైరెక్టర్లు రాంచందర్, శ్రీనివాస్, మల్లికార్జున్ పాటిల్, సొసైటీ సీఈఓ శ్రీశైలం ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు సంగ్రామ యాత్ర'

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు సంగ్రామ యాత్రను ప్రారంభించారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి యాత్రను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రెండో విడత యాత్రను చేపట్టామని, జిల్లా వ్యాప్తంగా పర్యటించి మార్చి 15వ తేదీన పటాన్‌చెరుకు చేరుకుంటామన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ బుచ్చేంద్ర మాదిగ, కోకన్వీనర్ చిరంజీవి మాదిగ, నాయకులు అబ్రహాం మాదిగ, జయరాజ్, ఆయా సంఘాల నాయకులు సుకుమార్, రాచందర్, రాజు, మురళి, విజయ్, యాదగిరి, రమేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులు నడపాలి

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ మెదక్ రీజియన్ సుదర్శన్ మంగళవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రయాణికుల నుంచి సమస్యలను స్వీకరించారు. మెదక్ నుంచి హైదరాబాద్ వయా పాపన్నపేట మీదుగా బస్సులు నడపాలని లింగాయపల్లి నుంచి సరస్వతీ వెంకటేశ్వర్ కోరారు. పెద్ద లింగాయపల్లి నుంచి సర్పంచ్ కిష్టయ్య మెదక్ నుంచి పెద్ద శంకరంపేటకు రాత్రి సమయాల్లో బస్సులు నడిపించాలన్నారు. మర్క్యూక్ మండలం నర్సాయిపేట నుంచి రామిరెడ్డి ఫోన్ చేసి గజ్వేల్ నుంచి జగదేవ్‌పూర్ వయా బచ్చన్నపేట్ మీదుగా బస్సులు నడపాలన్నారు. అల్లాదుర్గ్ మండలం గడి పెద్దాపూర్ నుంచి ప్రభాకర్ మెదక్ నుంచి పెద్ద శంకరంపేట్ మీదుగా గడిపెద్దపూర్‌కు బస్సు సర్వీస్ వేయాలన్నారు. బస్టాండ్లలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని న్యాల్కల్ నుంచి సత్యనారాయణ కోరారు. గజ్వేల్ నుంచి సంగారెడ్డి వరకు రాత్రి ఏడు గంటల సమయంలో ప్రతిరోజు బస్సులను నడిపించాలని సంగారెడ్డి నుంచి ప్రసాద్ కోరారు. కొత్తపల్లి నుంచి ప్రతాప్‌రెడ్డి మెదక్ నుంచి జేబీఎస్ వయా లింగంపల్లి మీదుగా బస్సులను నడపాలన్నారు. నారాయణఖేడ్ నుంచి పిట్లం వరకు బస్సులు నడపాలని సిర్గాపూర్ నుంచి అబ్దుల్ రెహమాన్ ఫోన్ చేశారు. అన్ని ఫిర్యాదులను నోట్ చేసుకున్న ఆర్‌ఎం త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నిధులొచ్చినా నిర్లక్ష్యమేనా?

- పంచాయతీరాజ్ రోడ్లకు లభించని మోక్షం!
- రూ.51.88 కోట్ల నిధులు మంజూరు
- ఇంకా పూర్తికాని టెండర్ ప్రక్రియ
- దెబ్బతిన్న రోడ్లతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కంకర తేలిన జహీరాబాద్ - అల్గోల్ రోడ్డు

జహీరాబాద్ టౌన్: దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరైనా టెండర్ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలో దెబ్బతిన్న పంచాయత్ రాజ్ రోడ్లకు మోక్షం లభించడం లేదు. నియోజకవర్గంలో దెబ్బతిన్న 26 పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులకు రూ.51.88 కోట్లు మంజూరయ్యాయి. దీంతో రోడ్లు బాగుపడతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరై ఏడాది కావస్తున్నా ఇంకా టెండర్ పక్రియ పూర్తికాలేదు. ఫలితంగా దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- నియోజకవర్గంలో జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని పలు గ్రామాల రోడ్లు దెబ్బతిని అధ్వానంగా తయారవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను బాగు చేయించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు పలు మార్లు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మంత్రి హరీశ్‌రావు రోడ్ల పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం నియోజకవర్గంలోని 26 పనులకు రూ.51.88 కోట్లను మంజూరు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామాల వారీగా నిధుల వివరాలు

- ఝరాసంగం మండలంలోని ఎల్గోయి – మొక్కన్‌పాడ్ రోడ్డుకు రూ.90 లక్షలు, రాయిపల్లి – కృష్ణాపూర్, బిడెకన్న రోడ్డుకు రూ. 95 లక్షలు, ఎల్గోయి – అల్గోల్– పోట్‌పల్లికి రూ.1.70 కోట్లు, ఝరాసంగం – సిద్దాపూర్ – రుక్మాపూర్ రోడ్డు మరమ్మతులకు రూ.2.05 కోట్లు, ఝరాసంగం – చిలెమామిడి రోడ్డుకు రూ.3.60 కోట్లు, బోప్పన్‌పల్లి, ఈదుపల్లి, ప్యాలరం, దేవరంపల్లి రోడ్డుకు రూ.2.80 కోట్లు మంజూరయ్యాయి.
- న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ – రాంతీర్థం రోడ్డుకు రూ.1.55 కోట్లు, గణేశ్‌పూర్ గ్రామం వరకు గల రోడ్డుకు రూ.79.50 లక్షలు, శంశెల్లాపూర్ – వడ్డీ రోడ్డుకు రూ.65 లక్షలు, చాల్కి – కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వరకు గల రోడ్డుకు రూ.4.50 కోట్లు, గంగ్వార్ – బసంత్‌పూర్ –మామిడ్గి రోడ్డుకు రూ.1.98 కోట్లు మంజూరయ్యాయి.
- జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి నుంచి కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వరకు గల రోడ్డుకు రూ.2.13 కోట్లు, జహీరాబాద్ – పోట్‌పల్లి రోడ్డుకు రూ.3.66 కోట్లు, బిడెకన్న – రాయిపల్లి(డి) రోడ్డు మరమ్మతులకు రూ.95 లక్షలు, అల్లీపూర్ రోడ్డుకు రూ.90 లక్షలు మంజూరయ్యాయి.
- కోహీర్ మండలంలోని బడంపేట – మనియార్‌పల్లి రోడ్డు మరమ్మతులకు రూ.1.45 కోట్లు, పోత్‌రెడ్డిపల్లి – కోహీర్ రోడ్డుకు రూ.3.30 కోట్లు, పిచరాగడి – పిచరాగడి తండా రోడ్డుకు రూ.1.42 కోట్లు, ఖానాపూర్ – సజ్జపూర్ రోడ్డుకు రూ.1.22 కోట్లు, శేఖాపూర్ – బడంపేట రోడ్డు మరమ్మతులకు రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనా ఇంత వరకు ఒక్క రోడ్డు పని కూడా ప్రారంభంకాలేదు. ప్రభుత్వం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని తెలిసింది. టెండర్ పక్రియ పూర్తికాని కారణంగా రోడ్ల మరమ్మతులకు నోచుకోవడం లేదు. బిల్లులు సకాలంలో రావడంలేదని కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొనడంలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా రోడ్లకు మరమ్మతులు లేక కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయండి



హద్నూర్, గుంజెట్టి, రాంతీర్థం గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా తయారైంది. కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ రోడ్డును బాగు చేయడం కోసం రూ.1.55 కోట్లు మంజూరయ్యాయి. నెలలు గడుస్తున్న ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. అధికారులు స్పందించి వెంటనే పనులను ప్రారంభించాలి.

– విశ్వనాథ్, గుంజెట్టి

టెండర్ దశలో ఉంది

జహీరాబాద్ నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైన మాట వాస్తవమే. జహీరాబాద్ ఏఈగా బాధ్యతలు స్వీకరించి వారం రోజులు అవుతుంది. పూర్తి అవగాహన లేదు. నాకు తెలిసి రోడ్ల మరమ్మతుల పనులు ప్రారంభం కాలేదు. ఇంకా టెండర్ దశలో ఉంది.

– రజనీకాంత్, స్పెషల్ ఏఈ, జహీరాబాద్

పని కల్పించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో యాక్టివ్ వేజ్ సీకర్స్‌లో కనీసం 50 శాతం మందికి పని కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. పటాన్‌చెరు, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాలకు సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లేబర్ మొబిలైజేషన్, పనుల గుర్తింపు, పంచాయతీ ట్యాంకర్ల వినియోగం, నర్సరీలు, మొక్కల నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పనులు చేసే సీజన్ అని, పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపితే వెంటనే పనులు మంజూరవుతాయన్నారు. పనులు పూర్తయిన చోట వర్క్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లేబర్ మొబిలైజేషన్ బాగా చేస్తున్న ఎంపీడీఓలను, ఎంపీఓలను, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ అభినందించారు. లక్ష్యాన్ని సాధించని వారిని హెచ్చరించారు. ప్రతి పంచాయతీలో నర్సరీల నిర్వహణ సరిగా ఉండాలన్నారు. ట్యాంకర్స్ ద్వారా ప్రతి వారం మొక్కలకు నీటిని అందించాలన్నారు. వంద శాతం పన్నులు వసూలు కావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు, డీపీఓ సురేశ్‌మోహన్, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు



స్టాళ్లను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ, తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి గ్రేడ్ మార్కులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతిలో 10 జీపీఏ తెచ్చుకున్న విద్యార్థులకు విద్యాశాఖ తరఫున ట్యాబ్ ఇస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు ఇందిరాదేవి, హరి శంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబయ్య, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫిజిక్స్ అధ్యాపకులు ఆచార్య మనోజ్ కుమార్ జాతీయ సైన్స్ దినోత్సవ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

అలరించిన కుస్తీ పోటీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని డప్పూర్ హజ్రత్ పీర్ గైబ్ సాహేబ్ ఖిబ్లా రెహమతుల్లా అలై జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన 40 మంది మల్లయోధులు పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బాల్కికి చెందిన కిరణ్‌బేడి, మహారాష్ట్రంలోని లాతూర్ షేక్ అయూబ్ హోరాహోరీగా కుస్తీపట్టారు. చివరకు షేక్ అయూబ్‌కు మొదటి బహుమతి వరించింది. గెలుపొందిన అయూబ్‌కు వెండి కడియంతో పాటు నగదును డప్పూర్ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవికుమార్ అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.



కుస్తీ పోటీల్లో పహిల్వాన్లు

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

- బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి
- రూ.43 కోట్ల పనులకు కౌన్సిల్ తీర్మానం

జిన్నారం(పటాన్‌చెరు): ఎండాకాలం సీజన్‌లో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన నిర్వహించారు. 2023 – 24 ఏడాదికి గాను రూ.43 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. కాలనీల్లో నీటి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్‌లు కోరారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి మాట్లాడుతూ ఎండాకాలం కావటంతో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎండాకాలంలో అధిక మొత్తంలో నీటి కోసం నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్వో శ్రీధర్, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- బొల్లారం మున్సిపల్ సమస్యలపై ప్రజల విన్నపాలు
- కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన
- ప్రజలకు సమాధానాలిచ్చిన కమిషనర్ రాజేంద్రకుమార్



బొల్లారంలోని ఓ కాలనీలో రోడ్డు దుస్థితి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం 'సమస్య మీది.. పరిష్కారం మాది' పేరిట నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. బల్దియా ప్రజలు ఫోన్ ద్వారా తమ సమస్యలను కమిషనర్ రాజేంద్రకుమార్ దృష్టికి తీసుకురాగా కొన్నింటికి అక్కడికప్పుడే పరిష్కారం చూపారు. ఆర్‌ఓ శ్రీధర్, ఇంజినీరింగ్ విభాగం ఏఈఈ కిష్టన్న, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాయికిరణ్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ మున్షీ నవీన్‌లతో కలిసి కమిషనర్ ప్రజల నుంచి వస్తున్న ఫోన్ కాల్స్‌ను రిసీవ్ చేసుకున్నారు. పలు సమస్యలను సంబంధిత అధికారులకు సూచిస్తూ పరిష్కరించేందుకు అక్కడికక్కడే చర్యలు చేపట్టారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ రాజేంద్రకుమార్, ఆయా శాఖల అధికారులు

పోచమ్మబస్తీలో మురికి నీరు రోడ్లపై పారుతుంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫాగింగ్ చేయాలి. డ్రెయినేజీలు నిర్మించాలి. మంచి నీళ్లు మధ్యాహ్నం వదులుతున్నారు. పరిశ్రమలకు వెళ్లే ప్రజలు నీళ్లు పట్టుకోలేకపోతున్నారు. సమస్యను పరిష్కరించండి.

– ఇమ్రాన్, పోచమ్మబస్తీ

కమిషనర్: వార్డుల వారీగా నీటిని విడుదల చేస్తున్నాం. నీటిని వదులుతున్న సమయంలోనే పట్టుకోవాలి. డ్రెయినేజీల నిర్మాణాలను త్వరలోనే చేపడుతాం.

వీధి లైట్లు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్తవి ఏర్పాటు చేయించాలి.

– రియాజ్, గాంధీనగర్

కమిషనర్: కాలనీల్లో లైట్లు వెలగటం లేదనే విషయం ఇప్పుడే మా దృష్టికి వచ్చింది. తక్షణమే సమస్యను పరిష్కరిస్తాం.

స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించారు. పనులు ముందుకు సాగడం లేదు. త్వరగా నిర్మాణం చేపట్టి స్టేడియంను వినియోగంలోకి తేవాలి.

– రాజు, బొల్లారం

కమిషనర్: స్టేడియానికి సంబంధించిన స్థలం కోర్టు పరిధిలో ఉంది. కోర్టునుంచి ఆదేశాలు రాగానే నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

మున్సిపల్ కార్యాలయం తాత్కాలిక భవనంలో కొనసాగుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవన నిర్మాణ పనులు చేపట్టాలి.

– ధనుంజయ్, కేబీఆర్ కాలనీ

కమిషనర్: నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం.

లోకల్ వాటర్ రాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. నీటి సౌకర్యాన్ని కల్పించండి.

– బాల్‌రాజ్, బాలాజీనగర్

కమిషనర్: నీటి సమస్యను సత్వరమే పరిష్కరిస్తాం.

బొల్లారంలోని 172 సర్వేనంబర్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లో ఉంది. ఆ స్థలాన్ని కబ్జా చేస్తూ కొంతమంది విక్రయాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవటం లేదు. అనుమతులు లేకున్నా మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లను కేటాయిస్తున్నారు. బొల్లారం, ఐలాపూర్‌కు చెందిన స్థలాలు కబ్జా అవుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– హన్మంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు

కమిషనర్: ఈ విషయం మా దృష్టికి రాలేదు. తహసీల్దార్‌తో పాటు మేము కూడా స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా భూములు కబ్జా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం.

– కృష్ణారెడ్డి, మల్లన్నబస్తీ

కమిషనర్: నీటి సరఫరా విషయంలో తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

యూజీడీ పనులతో సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లును వేయించాలి.

– వినోద్, బాలాజీనగర్

కమిషనర్: యూజీడీ నిర్మాణ పనులు పూర్తయ్యాక, సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తాం. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

మంజీరా నీటి సరఫరా కేవలం 15 నిమిషాలు మాత్రమే ఇస్తున్నారు. నీరు సరిపోవటం లేదు.

– రమేశ్‌రెడ్డి, బీరప్పబస్తీ

కమిషనర్: ప్రస్తుతం అరగంట పాటు నీటిని సరఫరా ఇస్తున్నాం. సమయం తక్కువ కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

యూజీడీతో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టండి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నీటి సమస్యను కూడా పరిష్కరించండి.

– నగేశ్, అంబేద్కర్ కాలనీ

కమిషనర్: అంబేద్కర్ కాలనీలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. కాలనీలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే చైర్ పర్సన్ చర్యలు చేపట్టారు.

సాక్షి ఫోన్ ఇన్

చెత్తను కాల్చివేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించండి.

– మహేశ్‌రెడ్డి, గాంధీనగర్

కమిషనర్: చెత్తను కాల్చివేసే విషయమై చర్యలు తీసుకుంటాం.

కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండటం లేదు. చర్యలు తీసుకోండి.

– అర్జున్, వైఎస్సార్ కాలనీ

కమిషనర్: వివిధ రకాల సమావేశాల వల్ల అధికారులు బయటకు వెళ్లాల్సి ఉంటుంది. ఏమైనా సమస్యలు ఉంటే కార్యాలయంలో అందుబాటులో ఉన్న అధికారులకు వివరించవచ్చు.

వీధి లైట్లు లేక రాత్రి సమయంలో రోడ్డుపై నడవాలంటే భయపడాల్సి వస్తుంది. ఈ సమస్యను పరిష్కరించండి.

– నరేందర్, కేబీఆర్‌కాలనీ

కమిషనర్: కొత్త విద్యుత్ పోల్స్ వేయాల్సి ఉంది. సమస్య పరిష్కారం అయ్యేందుకు నెల సమయం పడుతుంది.

క్లుప్తంగా

ప్రేమించి మోసం చేసిన యువకుడి రిమాండ్


దినేశ్

చిన్నశంకరంపేట(మెదక్): యువతిని ప్రేమించి మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కామారం తండాకు చెందిన డిగ్రీ చదువుతున్న యువతిని ప్రేమిస్తున్నానని చెప్పడంతో పాటు పెళ్లి చేసుకుంటానని దినేశ్ నమ్మించాడు. తనను శారీరకంగా వాడుకుని మోసం చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వేర్వేరు హత్య కేసుల్లో ఎనిమిది మందికి జీవిత ఖైదు

కంగ్టి(నారాయణఖేడ్): జిల్లాలో సంచలనం రేపిన గిరిజన యువకుడి హత్య కేసులో ఏడుగురు నిందితులకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ సంగారెడ్డి జిల్లా అదనపు, సెషన్స్, ఎస్సీఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి రాజు మంగళవారం తీర్పు చెప్పారు. కంగ్టి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2016 నవంబర్ 16వ తేదీన కంగ్టి మండలం ఘన్‌పూర్ తండాకు చెందిన పవార్ రాజేందర్(35)ను తడ్కల్ గ్రామానికి చెందిన నిందితులు రెడ్డి మారుతి, రెడ్డి జ్ఞానేశ్వర్, రెడ్డి రాంబాయి, రెడ్డి చంద్రపాల్, రెడ్డి లక్ష్మణ్, రెడ్డి సాయులు, రెడ్డి రాములు, రెడ్డి పండరి హత్య చేశారు. నిందితుల్లో రెడ్డి పండరి మృతి చెందాడు. మృతుడి భార్య పవార్ శోభాబాయి ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ తిరుపతన్న, ఎస్సై నానునాయక్ కేసు నమోదు చేశారు. కాగా పీపీ విజయ్ శంకర్ రెడ్డి వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులు ఏడుగురిని దోషులుగా నిర్ధారించారు. వారికి జీవిత ఖైదుతో పాటు రూ. 10 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

వట్‌పల్లి(అందోల్): హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు జడ్జి శ్రీధర్‌రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. ఎస్ఐ అంబర్యా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దేవునూర్ గ్రామానికి చెందిన తలారి కిరణ్‌కుమార్(9) 2016లో హత్యకు గురయ్యాడు. దీంతో మృతుడి తల్లి తలారి కవిత వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తలారి జైపాల్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిని విచారించగా కుటుంబ ఆస్తి తగాదాల నేపథ్యంలో కిరణ్‌ను హత్య చేసినట్లు తేలడంతో అతడికి జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ బైక్ ఎవరిదో!


ఎలుక చెరువు కట్టపై పడివున్న బైక్

కొడిపల్లి(నర్సాపూర్): చెరువు కట్టపై నాలుగు రోజులుగా బైక్ పడిఉంది. ఈ బైక్ ఎవరిదన్నది తెలియరాలేదు. కొడిపల్లి నుంచి వెలమకన్న వెళ్లే దారిలో ఎలుక చెరువు కట్టపక్కన ఏపీ 09ఏఎక్స్2852 నంబర్ ప్లేట్ ఉన్న బైక్ నాలుగు రోజులుగా ఉంది. రోడ్డుపైన ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. ఈ విషయయంపై కొడిపల్లి ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తామన్నారు.

వృద్ధురాలి మృతి

కొడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చి మృతి చెందినట్లు మంగళవారం ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడిపల్లి మండలం పీర్లతండా పంచాయతీ ధర్మతండాకు చెందిన గూగ్లోత్ పీర్య, అతడి తల్లి మోతి(62)తో కలిసి ఈనెల 24వ తేదీన రాయిలాపూర్ తండాలో బంధువుల ఇంటిలో జరిగే పెళ్లికి వెళ్లారు. రాత్రి పెళ్లికి వచ్చిన బంధువులను సాగనంపే క్రమంలో రోడ్డు దాటుతుండగా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికిచెందిన కాట్రోత్ బద్రు తన బైక్‌తో మోతిని ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలవడంతో మొదట నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఈనెల 27వ తేదీన ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చిన తరువాత మోతి మృతి చెందింది. మృతురాలి కొడుకు పీర్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

- డ్యూటీలో ఉండగా ఘటన
- మెమో ఇవ్వడంతో మనస్తాపానికి లోనయ్యాడంటున్న భార్య


భిక్షపతి (ఫైల్)


భర్త చనిపోయాడని తెలుసుకుని ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య బాలమణి

నర్సాపూర్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న పి.భిక్షపతి (49) సోమవారం రాత్రి గుండె పోటుతో మరణించారు. కాగా తన భర్త భిక్షపతి సోమవారం ఉదయం 6 గంటలకు డ్యూటీకి వెళ్లాడని మృతుడి భార్య బాలమణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం డ్యూటీలో భాగంగా భిక్షపతి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నుంచి సంగారెడ్డి వెళ్లి తిరిగి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వస్తుండగా మధ్యాహ్నం 12.45 గంటలకు ఆర్టీసీ టీటీఐ బస్సును తనిఖీ చేశాడు. ఓ ప్రయాణికుడు టికెట్ తీసుకోలేదని తేలడంతో టీటీఐ తనకు చార్జ్ మెమో ఇచ్చాడని భార్యకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నుంచి సంగారెడ్డికి రెండో ట్రిప్ వెళ్లి నర్సాపూర్ బస్టాండ్‌కు రాత్రి 8 గంటలకు వచ్చాడు. ఛాతీలో నొప్పిగా ఉందని బస్సు డ్రైవర్‌కు చెప్పడంతో అతడు బస్సును బస్టాండ్‌లో నిలిపి ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడి డ్యూటీ డాక్టర్ వైద్య పరీక్ష చేసి రెండు ఇంజక్షన్‌లు చేసి పంపాడు. డ్రైవర్‌తో కలిసి బస్టాండ్‌కు నడుచుకుంటు వస్తుండగా ఆసుపత్రి నుంచి సుమారు వంద మీటర్లు దూరంలో మళ్లీ ఛాతీలో నొప్పి ఎక్కువైందని డ్రైవర్‌తో చెబుతూ ఊపిరి ఆడడం లేదని చెప్పి స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే డ్రైవర్ మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ పరీక్షించి చనిపోయాడని ధ్రువీకరించాడు. టీటీఐ చార్జ్‌మెమో ఇవ్వడంతో తన భర్త భిక్షపతి మనస్సులో పెట్టుకుని బాధపడటం వల్లే గుండెపోటు వచ్చి మరణించాడని మృతుడి భార్య బాలమణి కన్నీటి పర్యంతమైంది. తన భర్త మరణంపై ఎలాంటి అనుమానం లేదని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కాగా మృతుడి భార్య బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు చెప్పారు.

మంచి కండక్టర్

భిక్షపతి మంచి కండక్టర్ అని గజ్వేల్– ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ చెప్పారు. విధులను సక్రమంగా నిర్వర్తించేవాడని, అతడిపై ఎలాంటి ఆరోపణలు లేవని, తన డ్యూటీ తాను చేసుకునే వాడన్నారు.

కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు

కండక్టర్ పి.భిక్షపతి సోమవారం రాత్రి డ్యూటీలో ఉండి గుండెపోటుతో చనిపోవడంతో అదే రాత్రి మృతుడి భార్య బాలమణి, ఇతర కుటుంబీకులు, బంధువులు, మిత్రులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. వారి రోదనలతో ఆసుపత్రి ఆవరణలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య బాలమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు సౌమ్య ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతుండగా, రెండో కూతురు సుమ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుందని తెలిసింది. మృతుడి స్వగ్రామం సిద్దిపేట జిల్లా ఎన్‌సాన్‌పల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు ప్రశాంత్‌గౌడ్, పలువురు నాయకులు వచ్చి మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు.

హత్యకేసులో నిందితుడి పట్టివేత

- డబ్బుల కోసం స్వామిని అంతమొందించిన అనుచరుడు
- 45 రోజుల క్రితం దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా చిక్కిన నిందితుడు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

పాపన్నపేట(మెదక్): సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు హత్య కేసు ఛేదించారు. స్వామి అవతారం ఎత్తి జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తిని డబ్బుల కోసం అతడి అనుచరుడు బండరాయితో మోది ఏడుపాయల్లో అంతమొందించాడు. 45 రోజులుగా కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. పాపన్నపేట పోలీసులు హంతకుడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పాపన్నపేట ఎస్ఐ విజయ్ నారాయణ్, మెదక్ రూరల్ సీఐ విజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కర్నూల్ పట్టణం శివప్పనగర్ కాలనీ, కలుగూరి ఎస్టేట్‌కు చెందిన బైలుపాటి రంగస్వామి(65) చిన్నపాటి స్వామిగా చెలామణి అవుతున్నాడు. ప్రజలకు జాతకాలు చెబుతూ, తాయెత్తులు కడుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. తరచూ ఏడుపాయలకు వస్తున్నాడు. జనవరి 9వ తేదీన జోగిపేటకు వచ్చి పోచమ్మ ఆలయంలో నిద్రించాడు. ఈ ఆలయంలో నెలకు రూ.500 వేతనంతో పనిచేస్తున్న గొల్ల నర్సింహులుతో పరిచయమైంది. అదే వేతనం తాను ఇస్తానని, తన వెంట రావాలని రంగస్వామి కోరడంతో అతడు ఒప్పుకున్నాడు. దీంతో ఇద్దరూ కలసి జనవరి 13వ తేదీన ఏడుపాయలకు వచ్చారు. అక్కడ ఓ భక్తుడికి తాయెత్తు కట్టడంతో అతడు రూ.8 వేలు ఇచ్చాడు. అందులో నుంచి రూ.500లు నర్సింలుకు ఇచ్చాడు. అయితే అతను ఎక్కువ డిమాండ్ చేసినా ఇవ్వలేదు. అదే రోజు సాయంత్రం ఇద్దరు కలసి ఏడుపాయల్లో మద్యం తాగారు. ఈ క్రమంలో మరోసారి ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో నర్సింహులను రంగస్వామి కొట్టాడు. కోపంతో నర్సింలు తిరగబడి బండరాయితో మోదడంతో రంగస్వామి మరణించాడు. అతడి సెల్ ఫోన్, డబ్బులు తీసుకొని జోగిపేట వెళ్లాడు. అక్కడ సెల్ ఫోన్‌ను ఓ దుకాణంలో అమ్మాడు. అయితే దుకాణం యజమాని నర్సింలు ఆధార్ కార్డు తీసుకున్నాడు. అప్పట్లో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నారు.

హంతకుడిని పట్టిచ్చిన సెల్‌ఫోన్

పాపన్నపేట ఎస్ఐ విజయ్ నారాయణ్, కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, బస్వరాజ్‌లు కేసును సవాలుగా తీసుకొని హంతకుడి కోసం వేట ప్రారంభించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఫోన్ కొనుగోలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడు ఆధార్ కార్డు ఇవ్వడంతో నర్సింహులును అదుపులోకి తీసుకొని విచారించారు. హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది.

ఇబ్బందులకు గురైతే ఫిర్యాదు చేయాలి

సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

సిద్దిపేటకమాన్: మహిళలు వరకట్నం, గృహహింస, పనిచేసే ప్రదేశాల్లో ఏమైనా ఇబ్బందులకు గురైతే డయల్ 100 లేదా, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలు, వరకట్న వేధింపులు, గృహహింస తదితర అంశాలపై సీఐ అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, కళాశాల విద్యార్థినులు ఇబ్బందులకు గురైతే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ్, పోలీసు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిచెంతకు


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న హెడ్ కానిస్టేబుల్

శివ్వంపేట(నర్సాపూర్): తప్పిపోయిన మూగబాలుడిని పోలీసులు తల్లిచెంతకు చేర్చారు. ఈ సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. గూడూర్ గ్రామానికి చెందిన నిరుడి మంజుల, రవి దంపతులకు కుమారుడు మనోజ్ (11) ఉన్నాడు. అతడికి మాటలు రావు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయి కిలోమీటర్ దూరంలో ఉన్న శివ్వంపేట గ్రామంలో తిరుగుతున్నాడు. వీధి కుక్కలు వెంటబడటంతో ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కుక్కల బారి నుంచి రక్షించాడు. 100 డయల్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి మనోజ్‌ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తప్పిపోయిన బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న బాలుడి తల్లి మంజుల పోలీస్‌స్టేషన్‌కు రావడంతో హెడ్‌కానిస్టేబుల్ సాయిలు కుమారుడిని తల్లికి అప్పగించారు.

ప్రజలకు మరింత చేరువ కావాలి

సీడీపీఓ రమాదేవి


మాట్లాడుతున్న సీడీపీఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, పుట్టబోయే చిన్నారులు, పుట్టిన బిడ్డలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేయాలన్నారు. నెల నెలా తీసుకోవాల్సిన ఆహారం అలవాట్లు, సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. ఆట పాటలతోనే చిన్నారులు శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందన్నారు. విద్యార్థులను వినూత్న బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ లింగారెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భూమయ్య, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు అభ్యసన సామగ్రిని అందజేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ములుగు(గజ్వేల్) : విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు మండలం క్షీరసాగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ వైజ్ఞానిక దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పది పరీక్షల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు కందాడి శంకర్‌రెడ్డి, కర్నాటి మంజుల చెరో రూ.50 వేల చొప్పున అందజేసిన ఆర్థిక సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం స్మారక ప్రయోగశాల, నూతన గ్రంథాలయాన్ని డీఈఓ ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు అభ్యసన సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు ఉచిత మినరల్ వాటర్‌ను అందజేస్తున్న అన్నసాగర్ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధికి సహకరిస్తున్న కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డిని డీఈఓ సత్కరించారు. పది పరీక్షల్లో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు తగిన ప్రోత్సహకాలు అందజేయడంతో పాటు పాఠశాలలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారని డీఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, రజనీకుమారి, తిరుపతిరెడ్డి, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ సందర్శన


జల్ జీవన్ మిషన్ బృందానికి నీటి సరఫరాపై అవగాహన కల్పిస్తున్న డీఈఈ నాగార్జున

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం కోమటిబండగుట్టపై ఉన్న మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ ప్రాంతాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన జల్‌జీవన్ మిషన్ బృందం మంగళవారం సందర్శించింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జల్‌జీవన్ మిషన్ అమలు, నిర్వహణకు ఆ రాష్ట్ర సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ఇంజనీర్లకు డీఈఈ నాగార్జున మిషన్ భగీరథ ప్రాజెక్టు అమలు తీరు వివరించారు. గోదావరి నీటి శుద్ధీకరణ, ఇంటింటికీ గ్రావిటీ ద్వారా తాగునీటి సరఫరా తదితర అంశాలు చెప్పారు.

వాటర్ పైప్‌లైన్ గుంతలోపడి యువకుడి మృతి


ఆనంద్ మృతదేహం

సిద్దిపేటకమాన్: వాటర్ పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో బైక్‌తో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరి ఆనంద్ (24) వృత్తిరీత్యా డ్రైవర్. భార్యాపిల్లలతో నంగునూర్‌లో నివాసంలో ఉంటున్నాడు. సిద్దిపేటలో బంధువుల ఇంట్లోని ఫంక్షన్‌కు సోమవారం రాత్రి వచ్చాడు. తిరిగి మంగళవారం ఉదయం బైక్‌పై నంగునూరు వెళుతున్నాడు. మార్గమధ్యలో సిద్దిపేట నాగదేవత ఆలయం, రేణుక ఎల్లమ్మ టెంపుల్ మధ్యలో బైపాస్ పక్కన వాటర్ పైప్ లైన్ కోసం గుంత తీశారు. అందులోపడిన ఆనంద్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వాటర్ పైప్‌లైన్ కోసం తీసిన గుంత వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంవల్లే గుంతలోపడి తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిరుధాన్యాల సాగును మరింత పెంచాలి

నాబార్డు డీడీఎం కృష్ణతేజ


సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం కృష్ణతేజ

జహీరాబాద్: చిరుధాన్యాల సాగును మరింత పెంచాల్సిన అవసరం ఉందని నాబార్డు డీడీఎం కృష్ణ తేజ అన్నారు. మంగళవారం చిరుధాన్యాల సాగు, విలువ ఆధారిత పదార్థాలపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దిడిగి గ్రామ శివారులో గల డీడీఎస్–కేవీకేలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్రం గుర్తించినందున మరింత విస్తీర్ణంలో చిరు ధాన్యాలను సాగు చేయాలన్నారు. కేంద్రం మార్కెట్ ధరలను పెంచే అవకాశం ఉందన్నారు. వాణిజ్యపంటల సాగు, రసాయనాల వినియోగంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యం కోసం చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.స్నేహలత, జి.శైలజ, స్వామి, మహిళా రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో 2022 సెప్టెంబర్‌లో జరిగిన చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరచినట్లు తూప్రాన్ సీఐ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన క్యాస శంకరయ్య ఇంటిలో సెప్టెంబర్ 4వ తేదీన రూ.1.50 లక్షల నగదు, 38 తులాల వెండి నగలు చోరీ చేశారు. అదే గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు బ్యాగరి రామానుజం చోరీ జరిగింది. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడంతో పాటు రూ.90 వేలు నగదు, 30 తులాల వెండి నగలు రికవరీ చేశామన్నారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని సీఐ అభినందించారు.

ప్రీతి ఘటనపై విచారణ చేపట్టాలి


సైఫ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సిద్దిపేటకమాన్: వరంగల్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ప్రీతి ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, ఆమె మృతికి కారణమైన సైఫ్‌ను చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం సైఫ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు బలై మెడికల్ విద్యార్థిని ప్రీతి, ఇంజినీరింగ్ విద్యార్థిని రక్షిత చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు విద్యానాథ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బీసీ హాస్టల్ విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. నాసికరం భోజనం పెడుతున్నారని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. హాస్టల్‌లో నాసికరం భోజనం, నీళ్ల చారుతో అన్నం పెడుతున్నారని, ఆ అన్నం తినలేక అర్ధాకలితో అలమటిస్తున్నామని తెలిపారు. ఏదేమిటని వార్డెన్‌ను అడిగితే బెదిరిస్తున్నాడని వాపోయారు. ఒక్క రోజు కాదు రెండు రోజులు కాదు నిత్యం ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అన్నంలో లక్క పురుగులు, రాళ్లు వస్తున్నాయని, ఓ వైపు ఆకలి, మరో వైపు తినలేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీస్‌లు వచ్చి ఆందోళనను విరమింపజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సత్యనారాయణరెడ్డి మృతదేహం

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం బైక్‌పై రంజోల్ గ్రామానికి చెందిన సత్యనారాయణ రెడ్డి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఐరన్ చువ్వల లోడుతో వెళ్తున్న ట్రాలీ ఆటో పట్టణంలోని పస్తాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొనడంతో చువ్వలు సత్యనారాయణరెడ్డి గొంతులో దిగబడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య


విజయ్ కుమార్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామానికి చెందిన జనార్దన్ రెడ్డి రెండో కుమారుడు గోవర్ధన్ రెడ్డి(40) తరచూ మద్యం తాగుతుండటంతో పెళ్లి కాలేదు. దీంతో మంగళవారం తెల్లవారుజామున గోవర్ధన్ రెడ్డి గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం తలుపులు కొట్టినా తియకపోవడంతో స్థానికుల సహకారంతో తలుపులు తెరిచి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడికి పెళ్లి కావడం లేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి జనార్దన్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న..

అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాకు చెందిన పరమేశ్వరరావు 15 ఏళ్ల క్రితం కుటుంబ సభ్యులతో బతుకుదెరువు కోసం రాష్ట్రానికి వచ్చాడు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడి రెండో కుమారుడు విజయ్ కుమార్(20) ఇంటర్ వరకు చదివాడు. ప్రస్తుతం మణికొండలో ఉండే స్నేహితుడి వద్ద ఉంటూ ప్రభుత్వం ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇస్నాపూర్ వచ్చిన విజయ్ కుమార్ బెడ్ రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. గమనించిన తల్లి స్థానికుల సహకారంతో విజయ్‌కుమార్‌ను చికిత్స కోసం ఇస్నాపూర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకరాగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. తన కుమారుడు అనారోగ్య సమస్యతో ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో నాగుపాము కలకలం


కొట్టాలలో నాగుపామును పట్టుకున్న రైతు

కొడిపల్లి(నర్సాపూర్): వరి పొలంలో పనులు చేస్తున్న రైతులకు నాగుపాము కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయాందోళన చెందారు. మరో రైతు దానిని పట్టుకొని అడవిలో వదిలేశాడు. కొడిపల్లి మండలం కొట్టాల గ్రామానికి చెందిన గొరకింటి నరహరి తన పక్కపొలంలో పాము వచ్చిందని రైతులు కేకలు వేయడంతో అక్కడికి వెళ్లాడు. అక్కడ నాగుపాము ఉన్నట్లు గమనించాడు. పామును నేర్పుగా పట్టుకొని సమీప అడవిలో వదిలేశాడు. పాములు లేవన్న తరువాత రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

తాగునీటిలో విషప్రయోగం

శివ్వంపేట(నర్సాపూర్): పశువుల తాగునీటి తొట్టిలో గుర్తుతెలియని వ్యక్తులు పురుగుల మందు కలిపారు. ఈ సంఘటన మండల పరిధి చెండి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు గ్రామ శివారులో డైరీఫామ్ ఏర్పాటు చేసుకున్నాడు. పాడిగేదెల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధ రాత్రి పురుగుల మందు కలిపారు. నీటి తొట్టి నుంచి వస్తున్న వాసన గ్రహించిన ఆంజనేయులు పశువులు అటువైపుకు వెళ్లకుండా ఆ నీటిని తొలగించాడు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. పశువులను చంపేందుకు నీటి తొట్టిలో పురుగుల మందు కలిపారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆంజనేయులు కోరాడు.